క్లుప్తంగా

సీవోఈ కాలేజీ హయత్ నగర్‌లోనే కొనసాగించాలి



నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని హయత్ నగర్‌లో కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) కళాశాలను యథావిధిగా కొనసాగించాలని జిల్లాకు చెందిన పలువురు నాయకులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర నోడల్ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ కళాశాలను నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు తరలించవద్దన్నారు. హైదరాబాద్ నుంచి 150 కి.మీ దూరంలో అచ్చంపేటకు వెళ్లి చదువుకోవడం కష్టమవుతుందన్నారు. మడావి కిషన్, టేకం లక్ష్మణ్, కుమ్ర రాజు, కుమ్ర జలపత్ రావు, తదితరులు ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీ ఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం వాక్‌ఇన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రి న్సిపాల్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు దరఖాస్తు చేసిన కాపీలతో హాజరుకావాలని తెలిపారు. ఐటీఐ కోర్సుల్లో కోపా, డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రాఫర్, వెల్డర్, డీఎం సివిల్, ఎలక్ట్రీసియ న్, ఏటీసీ కోర్సుల్లో.. మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ ఆటోమిషన్ టెక్నీషియన్, ఇండస్ట్రీయల్, రోబోటిక్ డిజిటల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, సీఎన్‌సీ మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, వర్చువల్ అనాలసిస్ కోర్సుల్లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9493 535378 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

నేరడిగొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని చింతగూడ, బండ్లగూడ, నంద్యా నాయక్ తండా గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించి మాట్లాడారు. వారం వారం లబ్ధిదారుల ఖాతాల్లో విడతల వారీగా నిధులు జమ చేస్తామన్నారు. బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణ్‌సింగ్, మాజీ ఎంపీపీ ప్రేమ్‌సింగ్, నాయకులు రాజశేఖర్ రెడ్డి, సాబ్లే కైలాష్, బోథ్ ఆత్మ డైరెక్టర్లు సాబ్లే అందు సింగ్, సురేష్ తదితరులు ఉన్నారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌అర్బన్ కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ సోమయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి 11 వరకు మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు, 7వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఆదిలాబాద్ అర్బన్ మండలానికి చెందినవారే అర్హులని పేర్కొన్నారు. వివరాలకు ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'జన సురక్ష' వరంలాంటిది

ఇచ్చోడ: జన సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వరం లాంటిందని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ రామచంద్రరావు అన్నారు. ఆర్బీఐ సహకారంతో ఆర్థిక అక్షరాస్యత పై మండలంలోని ముఖర(బి) గ్రామంలో మంగళవారం నిర్వహించిన జన సురక్ష కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గ్రామాల్లో జన సురక్ష ద్వారా బ్యాంకులకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సామాజిక భద్రత బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ ఉత్పల్ కుమార్ దామ్ మాట్లాడుతూ ఖాతాదారులు కేవైసీ చేయించుకోవాలన్నారు. ఇచ్చోడ బ్యాంక్ మేనేజర్ నాగభూషణ్, మాజీ సర్పంచ్ మారుతి, సీఎఫ్ఎల్ కౌన్సిలర్స్ సంతోష్, అరవింద్‌గౌడ్, ప్రసాద్, ఎస్‌బీఐ సీఎస్‌పీ సాగర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భీంపూర్: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నిఖిల్‌రాజ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యసిబ్బందితో సమావేశమై మాట్లాడారు. పరిసర ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ పారామెడికల్ అధికారులు వామన్ రావ్, రమేశ్, వైద్య విస్తరణాధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రూపిదాస్, మేఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉర్దూ'కు ఆదరణ కరువు!

- పలు పాఠశాలల్లో టీచర్ పోస్టులు ఖాళీ
- మైనార్టీ విద్యార్థులు చదువుకు దూరం
- ఆంగ్లమాధ్యమం వైపు ఆసక్తి



ఇలాయిజ్‌నగర్ గ్రామంలో ఉర్దూ మీడియం పాఠశాల



నార్నూర్‌లోని ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉర్దూ మీడియానికి ఆదరణ కరువు ఏర్పడుతుంది. ఫలితంగా విద్యార్థుల హాజరుశాతం తగ్గుతున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ఉర్దూ మీడియాన్ని ప్రాథమిక కల్పించిన క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంది. అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీలతో మైనార్టీ, పేద విద్యార్థులు ఉర్దూ మీడియానికి దూరమవుతున్నారు. ఆంగ్ల మీడియం వైపు ఆసక్తి చూపుతున్నారు. మండల కేంద్రంతోపాటు నాగల్‌కొండా, ఇలాయిజ్‌నగర్, రాజులగూడ తదితర గ్రామాల్లో మైనార్టీలు అధికంగా ఉన్నారు. వారి పిల్లల కోసం గత కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం మండల కేంద్రంలో ఉర్దూ మీడియం పాఠశాల ఏర్పాటు చేసింది. నార్నూర్ జెడ్పీ ఉన్నత, మిగతా గ్రామాల్లో ప్రాథమిక ఉన్నత పాఠశాలలు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇద్దరు టీచర్లను నియమించింది. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉర్దూ మీడియం పాఠశాలలో టీచర్లు లేక బోధన కుంటుపడుతుంది.

తగ్గుతున్న సంఖ్య

ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1 నుంచి పదో తరగతి వరకు 80 మంది విద్యార్థులు ఉండగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో దాదాపు 54, నాగల్ కొండాలో 10, ఇలాయిజ్‌నగర్‌లో 24 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. చాలామంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం బడిబాట కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఉపాధ్యాయులు లేక ప్రత్యామ్నాయం మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ

ఉర్దూ మీడియం పాఠశాలలకు ప్రభుత్వం ఇద్దరు టీచర్లను నియమించింది. గతంలో పనిచేసిన ఇద్దరు బదిలీపై వెళ్లారు. ఏజెన్సీ ప్రాంతం కావడం, కొన్నేళ్లు గడుస్తున్నా నేటివరకు నియమించలేదని ఆరోపణలు ఉన్నాయి. నార్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బయోలజి, ఫిజిక్స్, గణిత శాస్త్రం బోధించే టీచర్లు లేరు. నాగల్‌కొండ, ఇలాయిజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో తెలుగు మీడియం నుంచి ఒక్కొక్క ఉపాధ్యాయుని సర్దుబాటు చేశారు. ఇప్పటికి వారికి ఉర్దూ బోధన చేసేవారు లేరు. దీంతో గ్రామస్తులు డబ్బులు జమచేసి వారికి నెలకు రూ.5 వేల నుంచి రూ.6 వేలు చెల్లించి యువతతో విద్య బోధనలు చేయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉర్దూ మీడియంలో బోధించే టీచర్లను నియమించాలని మైనార్టీలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మండలంలో మొత్తం నాలుగు ఉర్దూ మీడియం పాఠశాలలు ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతం కావడంతో టీచర్ల పోస్టులు భర్తీ కాలేదు. ప్రత్యామ్నయ చర్యలు తీసుకున్నాం. తెలుగు మీడియం నుంచి ఒక్కొక్క ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై సర్దుబాటు చేశాం. ఉర్దూ బోధించేవారు లేరు. ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం.

– పవార్ అనిత, ఎంఈవో, నార్నూర్

కొలాం తెగకు అవకాశాలు కల్పించాలి

- కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్‌రావు



మాట్లాడుతున్న గోవింద్‌రావు

ఆదిలాబాద్‌రూరల్: ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఆమడదూరంలో ఉన్న కొలాం తెగను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గుర్తించి వివిధ రంగాల్లో అవకాశాలు కల్పించాలని కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీవీటీజీ తెగలకు రాజకీయంగా గుర్తింపు లభించకపోవడంతో అభివృద్ధి చెందలేకపోతున్నామన్నారు. ఈనెల 9న ఆదివాసీ ప్రపంచ దినోత్సవం సందర్భంగా ప్రతీ కొలాం గ్రామంలో పటేళ్లు, దేవరీలు, మహాజన్లు ఆయా గ్రామాల ప్రజలతో వేడుకలను ఘనంగా జరుపుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు హాజరుకావాలన్నారు. సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొడప సోనేరావు, గౌరవ అధ్యక్షులు టేకం రాజు, సాత్నాల మండల అధ్యక్షుడు కొడప రాము, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భీంరావు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



శ్యాంపూర్‌లో పథకాలపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

ఉట్నూర్‌రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని నిర్మల్ జిల్లా ప్రభారి బస్వరాజు, లక్ష్మీనరసయ్య, నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి పాటుపడాలన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను మారుమూల గ్రామాల్లో ఇంటింటా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం శ్యాంపూర్ గ్రామంలో బూత్‌ల వారీగా కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. మాజీ జెడ్పీటీసీ సాడిగె గంగన్న, మాజీ ఎంపీపీ ఆడే ధన్‌లాల్, బానోత్ జగన్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, ఉట్నూర్ మండల అధ్యక్షుడు బింగి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సారూ.. ఇదేమి తీరు



ఆదిలాబాద్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన పలువురు గురువులు వారితో పనిచేయించుకున్నారు. జిల్లా కేంద్రంలోని యూపీఎస్ ఎన్జీవోఎస్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మంగళవారం విద్యార్థులతో వాటర్ క్యాన్ మోయించారు. పాఠశాలకు 300 మీటర్ల దూరం నుంచి వాటర్ క్యాన్ తెప్పించుకోవడం విమర్శలకు తావిస్తోంది. టీచర్లు తీసుకురమ్మని చెప్పారని విద్యార్థులు 'సాక్షి'కి వివరించారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న సమితి ప్రతినిధులు

కైలాస్‌నగర్: నీతి ఆయోగ్ నార్నూర్ బ్లాక్ రాష్ట్ర స్థాయి సంపూర్ణత అభియాన్ సమరోహంలో భాగంగా గవర్నర్ చేతుల మీదుగా స్వర్ణ పతకాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షాను సనాతన హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు సన్మానించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. సమితి గౌరవ అధ్యక్షుడు బండారి వామన్, ఉపాధ్యక్షుడు రేణిగుంట రవీందర్, సభ్యులు దశరథ్, నర్సోజి, కందుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోకు..



సన్మానిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమం అమలులో ఉట్నూర్ ఐటీడీఏ అత్యుత్తమంగా నిలిచింది. ఇటీవల హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ దర్బార్ మందిరంలో గవర్నర్‌తో పురస్కారం పొందిన ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను మంగళవారం కార్యాలయ పరిపాలన అధికారి, సిబ్బంది సన్మానించారు. ఏవో దామోదరస్వామి, ఏపీవో పీవీటీజీ మనోహర్, జీసీసీ డీఎం సందీప్, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంపీడీవో మహేశ్‌కుమార్

జైనథ్: మండలంలోని కొటా ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఎంపీడీవో మహేశ్‌కుమార్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ సెక్రెటరీ జ్యోతి, టీచర్లు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

నార్నూర్: శ్రావణమాసం పురస్కరించుకొని గాదిగూడ మండలం తోయగూడ గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం గ్రామస్తులు మహాపూజ నిర్వహించారు. గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర చేపట్టారు. మహిళలు కలశంతో పాదయాత్రలో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ రాథోడ్ గోవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

నార్నూర్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బంది సీహెచ్‌సీ వైద్యాధికారి జితేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, హెచ్ఈ తులసీదాస్ రాథోడ్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా డీజే వినియోగిస్తే చర్యలు

తలమడుగు: వినాయక చవితి పండుగ సందర్భంగా ఎలాంటి అనుమతి లేకుండా డీజే సౌండ్స్ ను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై రాధిక అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అనుమతి లేకుండా నిర్వాహకులు డీజే సౌండ్ బాక్స్‌లు వినియోగించొద్దన్నారు. మండలంలోని నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

నేరడిగొండ: ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని కుమురంభీం భవనంలో వారు మాట్లాడారు. నేరడిగొండలో నిర్వహించే ర్యాలీలోఆదివాసీలు పాల్గొనాలని కోరారు. అలాగే ఆదివాసీ దినోత్సవానికి రావాలని ఆదివాసీ సంఘం నాయకులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గంగారాం, నగేష్, గ్రామ పటేళ్లు, గ్రామ పెద్దలు ఉన్నారు.

విద్యార్థినికి సత్కారం

జైనథ్: హైదరాబాద్‌కు చెందిన మంచి రాజుబాల సాహిత్య పీఠం నిర్వహించిన పిల్లల కథల పోటీలో మండలంలోని లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని హేడవ్ యోగిత రాసిన 'నిజాయితీగా చదువు' శీర్షికపై ప్రత్యేక బహుమతి లభించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బాల సాహితీ అకాడమీ అవార్డు గ్రహీత, ట్రస్ట్ ప్రాంతీయ అధికారి పత్తిపాక మోహన్ విద్యార్థికి ప్రశంసా పత్రంతోపాటు, జ్ఞాపిక, నగదు అందించి సత్కరించారు. హెచ్ఎం హనుమంతరావు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

జాబ్ మేళా..చిన్నారుల గోల





ఆదిలాబాద్‌లోని ఎస్టీయూ భవన్‌లో మంగళవారం టాస్క్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి నిరుద్యోగులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వారితోపాటు చిన్నపిల్లలను సైతం వెంటబెట్టుకుని పాల్గొన్నారు. నిరుద్యోగుల బంధువులు, వారి తల్లిదండ్రులు, అమ్మమ్మలు, నాయనమ్మలు చిన్నారులతో కనిపించగా 'సాక్షి'కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ప్రమాదకరంగా స్తంభాలు

- నాసిరకంగా ట్రాన్స్‌ఫార్మర్ గద్దెల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



మోమీన్‌పురలో పగుళ్లుతేలిన ట్రాన్స్‌ఫార్మర్ గద్దె

ఉట్నూర్‌రూరల్: పట్టణ కేంద్రంలోని ఐబీ చౌరస్తా, అంగడిబజార్, గంగన్నపేట తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. వంగిన ఉన్న స్తంభాలతో ప్రమాదం పొంచి ఉంది. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మోమీన్‌పుర కాలనీలో నెల క్రితం ఓవర్ లోడ్ తగ్గించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్.. ట్రాన్స్‌ఫార్మర్ కోసం నాసిరకంగా గద్దె నిర్మించారు. నెల రోజులకే బీటలు వారి దర్శనమిస్తోంది. దీంతో పనులు ఏ మేరకు నాణ్యతగా కొనసాగుతున్నాయో ఇట్టే తెలుస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదు. ఇలా నాసిరక పనులతో నిధుల దుర్వినియోగం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు ఆనుకొని ఉండటంతో ఈ దారిగుండా ప్రధాన కార్యాలయాలు, పాఠశాలలు ఉన్నాయి. రాకపోకలు సాగించేవారికి ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయమై అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదని పేర్కొంటున్నారు.

కంచె ఏర్పాటు చేయాలి

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి. గద్దె పగలడంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి గద్దె నిర్మించాలి.

– అన్సార్, మోమీన్‌పుర కాలనీవాసి

కాళేశ్వరంపై ఆరోపణలు నిరాధారం

- మాజీమంత్రి జోగు రామన్న



ప్రొజెక్టర్‌పై హరీశ్‌రావు ప్రసంగాన్ని నేతలతో కలిసి వీక్షిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కాళేశ్వరం ప్రాజెక్టుపై వస్తున్న ఆరోపణలు నిరాధారమని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రొజెక్టర్‌పై మాజీమంత్రి హరీశ్‌రావు ప్రసంగాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషన్ల పేరిట రిపోర్టులు ఇస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు కమిషన్ల పేరుతో కాలయపన చేస్తున్నారన్నారు. కేవలం మాజీ సీఎం కేసీఆర్‌ను హింసించాలనే దురుద్దేశం తప్పా రైతులకు మేలు చేయాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదని ధ్వజమెత్తారు. కుట్రపూరితంగానే కమిషన్ విచారణ జరిగినట్లు కనిపిస్తోందని, ఎలాంటి ఆధారాలు లేని రిపోర్ట్ ఇచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి రాజకీయ కక్షసాధింపు చర్యలు చేస్తున్నాయన్నారు. సమావేశంలో జోగు ప్రేమేందర్, నిమ్మల రమేశ్‌రెడ్డి, యాసం నర్సింగరావ్, సాజిదొద్దీన్, మెట్టు ప్రహ్లాద, మార్శెట్టి గోవర్ధన్, సావాపురే విజయ్, సలీంపాషా, గణేశ్‌యాదవ్, స్వరూపరాణి, బుట్టి శివ, ప్రశాంత్, బొడగం మమత, పర్వీన్ ఫెరోజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గుణపాఠం చెప్పాలి

- బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. ఇంటింటికీ బీజేపీ మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మంగళవారం కేంద్ర పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్, ఆరు గ్యారంటీ పథకాలతో అధికారంలోకి వచ్చి ప్రస్తుత కాంగ్రెస్ రెండు ఒక్కటేనని విమర్శించారు. అధికారం కోసం మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన తర్వాత ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. బీజేపీతోనే అన్నివర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దీపక్ సింగ్ షెకవత్, దేవ్‌పూజే మారుతి, ఆరెల్లి రాజలింగు, రాథోడ్ రాధిక, కోవా రాజేశ్వర్, కనక హనుమంత్‌రావ్, దిలీప్‌మోరే, మస్కే రాజువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యం

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్
- మెడికోలకు ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట మెడికోలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినబిడ్డకు ముర్రుపాలు తాగించాలని, దీంతో శిశువు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, బిడ్డలు పాలు పట్టే అంశాలపై అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, వైద్యులు హేమలత, అనంత్‌రావు, విద్యవిల్సన్, సరోజ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని సీడీపీవో ఉమాదేవి అన్నారు. ఐటీడీఏ పరిధిలోని పెర్కగూడ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై సూపర్‌వైజర్ మంజులత, అంగన్‌వాడీ టీచర్ శారదతో కలిసి మంగళవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

ఆదిలాబాద్‌టౌన్: బిడ్డకు తల్లిపాలే అమృతం లాంటిదని మహాలక్ష్మివాడ అంగన్‌వాడీ టీచర్ సుజాత అన్నారు. మంగళవారం కాలనీలో అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణుల ఇంటికి వెళ్లి తల్లిపాల ఆవశ్యకత గురించి తెలియజేశారు. ఆశ కార్యకర్త, ఏఎన్ఎం పాల్గొన్నారు.

కాడెద్దుకు అంత్యక్రియలు



ఎడ్లబండిలో కాడెద్దు కళేబరం

తాంసి: వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా ఉన్న కాడెద్దు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించి ఆ రైతు తన ప్రేమను చాటుకున్నాడు. మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన రైతు గుజ్జెట్టి రాందాస్ 7 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. కాడెడ్లలో ఒకటి మంగళవారం అనారోగ్యంతో మృతిచెందింది. గ్రామస్తుల సహకారంతో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి తన పొలంలో పూడ్చిపెట్టాడు.

పంటల క్షేత్ర సందర్శన

తాంసి: వ్యవసాయ పరిశోధన స్థానం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో తాంసి, తలమడుగు మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం పంటల క్షేత్ర సందర్శన చేపట్టారు. కుచులాపూర్, పల్సి, సుంకిడి గ్రామాల్లో పత్తి, సోయా పంటలను శాస్త్రవేత్తలు రాజశేఖర్, మోహన్‌దాస్, రాజేందర్, రఘువీర్ పరిశీలించారు. సోయాలో కాండపు తొలుచు పురుగు, కాండపు ఈగ, పత్తిలో పెనుబంక నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

బోథ్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీపీఐ నాయకులు ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నరేశ్, కార్తీక్, శ్రీకాంత్ ఉన్నారు.